

నేటిధాత్రి®
22nd ANNIVERSARY
తెలుగు వార్త పత్రిక



ఆదివారం 26-04-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 27 రూ॥ 6.00


# యుద్ధమై వస్తున్నా... జైత్ర యాత్ర సాగిస్తా!

## సామాజిక న్యాయం నినాదం... సర్వోదయ తెలంగాణ విధానం

## తెలంగాణ పౌరుషం నింపుకున్న కొత్త పార్టీ

## తెలంగాణ ఆత్మ నిండిన సరి కొత్త శక్తి

# టీఆర్ఎస్


















## తెలంగాణ ఆత్మగౌరవం నింపుకొని వస్తున్న కవిత సేన టీఆర్ఎస్

- టీఆర్ఎస్ లో ఉద్యమకారులకు పెద్దపీట
- తెలంగాణ ఉద్యమ త్యాగధనుల బలీయమైన ఆర్తి.
- అమరవీరుల కుటుంబాలకు సామాజిక రక్షణ, ఆర్థిక చేయూత.
- అమర వీరుల కుటుంబాలకు కోటి రూపాయల ఆర్థిక భరోసా.

- అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి, సమాన ప్రాధాన్యతా ప్రతిపత్తి.
- విద్యా వైద్య రంగాలలో కనీ వినీ ఎరగని నూతన నిర్ణయాలు.
- సరికొత్త సామాజిక ప్రగతి విప్లవాలు
- ఉచిత విద్య, ఉచిత వైద్యంతో సంపూర్ణ తెలంగాణ ఆవిష్కరణ.
- ఏకకాలంలో యువతకు ఉపాధి కల్పన, ఉద్యోగ కల్పన.
- వ్యాపార రంగాన్ని ఎంచుకునే యువతకు ప్రత్యేక ప్రోత్సహం.
- రూ. 2 లక్షల నుండి రూ. 20 కోట్ల వరకు నేరుగా ప్రభుత్వ సాయం.
- యువత నూతన ఆవిష్కరణల ప్రోత్సాహం కోసం ప్రత్యేక ప్రాధాన్యత.
- గెలిచిన తొలి సంవత్సరమే 4లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు.
- ఉద్యమకారులకు గౌరవప్రదమైన లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు.
- రైతు రాజ్య స్థాపనే మార్గం.. రైతే రాజు తెలంగాణా కు గర్వకారణం!
- అన్ని రకాలుగా రైతు కళ్ళలో ఆనందమే తెలంగాణాకు రక్ష.
- మైనార్టీ లకు అన్ని రంగాలలో ప్రోత్సాహకాలు.
- సామాజిక న్యాయం టీఆర్ఎస్ ధ్యేయం.
- సర్వోదయ తెలంగాణే టీఆర్ఎస్ లక్ష్యం
- అన్ని వర్గాల రాజకీయ సమ్మిళితమే తెలంగాణ రాష్ట్ర సేన.
- వైరి పక్షాల మీద సంఘటిత రాజకీయ యుద్ధమే టీఆర్ఎస్.



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు.

## తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ

- కవిత సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావం
- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి..పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- తెలంగాణ కోసం పోరాడిన వారంతా మోసపోయారు
- మునుపటి కేసీఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం
- పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు
- అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం టీఆర్ఎస్‌తో వచ్చా
- పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత



బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బీజేపీల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే

12లో

నేటిధాత్రి ®
22ND ANNIVERSARY
తెలుగు వార్త పత్రిక

ఆదివారం 26-04-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 27 రూ॥ 6.00





### ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు

# ముహూర్తం ఫిక్స్

### అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..



హైదరాబాద్, నేటిధాత్రి:
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశముంది.
ముఖ్యంగా వీమీగ్రాష్ట్రుంవ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం.
రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్‌లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఇది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని అధికారిక షెడ్యూల్ పూర్తిగా ప్రకటించాల్సి ఉంది

## మావోయిస్టులకు భారీ దెబ్బ..

# 47 మంది లొంగుబాటు

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో మావోయిస్టు ఉద్యమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల

04 లో

## తెలంగాణ స్పేస్ రంగంలో

# కొత్త దిశ

- శంషాబాద్‌లో విక్రం-1 రాకెట్ ఫ్లాగ్ ఆఫ్
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘన ప్రారంభం
- రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీకి వేగం
- ఐటీఐల అప్‌గ్రేడ్‌కు టాటా గ్రూప్ తో భాగస్వామ్యం
- యువతకు ఏరోస్పేస్ రంగంలో కొత్త అవకాశాలు



శంషాబాద్‌లో విక్రం-1 రాకెట్‌ను ఫ్లాగ్ ఆఫ్ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.





హైదరాబాద్, శంషాబాద్:
శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన విక్రం-1 రాకెట్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా ఫ్లాగ్ ఆఫ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ కార్యకలాపాలను సీఎం సమగ్రంగా పరిశీలించి, దేశంలో ప్రైవేట్ అంతరిక్ష రంగ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు.
సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నామని, ఆనంద్ మహీంద్రా బోర్డు చైర్మన్‌గా ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ఏరోస్పేస్ రంగానికి అవసరమైన నైపుణ్య సిబ్బందిని ఈ యూనివర్సిటీ ద్వారా తయారు చేస్తామని, అన్ని స్కిల్స్ విభాగాలను ఒకే వేదికలోకి తీసుకువస్తామని తెలిపారు. ఐటీఐలను టాటా గ్రూప్ సహకారంతో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా మారుస్తూ, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేపడుతున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తూ, ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు.
స్కైరూట్ ఏరోస్పేస్ వంటి సంస్థలతో తెలంగాణ అంతరిక్ష రంగంలో వేగంగా ముందుకు సాగుతోందని సీఎం పేర్కొన్నారు. యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్రాన్ని ఆధునిక సాంకేతిక రంగాల్లో ముందంజలో నిలిపే మరో కీలక అడుగుగా నిలిచింది.

## కవిత పార్టీతో

# ఒరిగేదేమీ లేదు

- తెలంగాణలో వచ్చిదే బీజేపీయే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



హైదరాబాద్, నేటిధాత్రి:
కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు

04 లో

## కవితకు రాజకీయ సమాధి

# కట్టింది బీజేపీనే

### ఎంపీ అర్వింద్



హైదరాబాద్, నేటిధాత్రి:
సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ

04 లో

## తెలంగాణ ప్రజలు

# ఆమెను నమ్మరు

### తెలంగాణ ప్రజలను... కవిత తప్పుదోవ పట్టిస్తున్నారు: కిరణ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు

04 లో

# పాంచ జన్యం పూరించిన కవిత




డెస్క్, నేటిధాత్రి:
కల్వకుంట్ల కవిత.. ఈ పేరు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలంగాణలో కవిత అంటే బతుకమ్మ అన్న స్థాయిలో ప్రాచుర్యం పొందారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా దివిటీ పట్టి వెలగించారు. తండ్రి కేసీఆర్ ఒడిలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కవిత.. ఇవాళ తండ్రి పార్టీని ధిక్కరించి.. తండ్రినే ఎదిరించి.. నిలదీసే స్థాయిలో.. కొత్తగా పార్టీని ప్రకటించి పాంచజన్యం పూరించారు. ఒక్కరోజు తేడాలో పాత టీఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం జరుగనుంది. దానికి రెండ్రోజుల ముందు కవిత తన పార్టీ కోసం ఎంచుకున్న తేదీ యాదృచ్ఛికం కాకపోయినా... ముహూర్త బలం ఉండేవుంటుంది. ఓ మహిళగా కవిత మహిళా లోకానికి బాగా తెలుసు. బతుకమ్మతో తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. తెలంగాణ ఉద్యమం లో మమేకం అయ్యారు. తెలంగాణ ఏర్పడితే అందరూ బాగుపడతారని నమ్మి అంతా కేసీఆర్ జెండా మోసారు. కానీ తెలంగాణ ఆగమయ్యింది. కెసిఆర్ కుటుంబం బాగుపడ్డది. అవినీతిలో ఆరితేరారు. లక్షల కోట్లు వెనకేసుకున్నారు. ఈ అవినీతి, తెలంగాణ ఆకాంక్షలను పక్కదారి పట్టించిన తీరుతోనే కేసీఆర్ పార్టీని ప్రజలు బొందపెట్టారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చాక ఉన్న పేగుబంధం కూడా తెగిపోయింది. బీఆర్ఎస్ అవినీతిని ఎదరించిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో ప్రయాణిస్తున్నారు. రెండున్న రేళ్లు కావస్తున్నా.. ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. రేషన్ కార్డులు ఇచ్చాం.. సన్న బియ్యం ఇచ్చాం.. ఇదే పల్లవి. కానీ ప్రజల బాధ మరోలా ఉంది. ధాన్యం కొనడం లేదు. గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఉద్యోగాలు దక్కడం లేదు. అవినీతి పెరిగింది. పైసా ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కిందిస్థాయి నుంచి మంత్రుల వరకు అవినీతి అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. వెలుగుమట్ల ఘటన ఒక్కటి చాలు.. పేదలను ఎంతగా రాచి రంపాన పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 50శాతం ఉన్న మహిళలు. 50 శాతం ఉన్న దళిత, గిరిజన, బహుజనులకు రాజ్యాధికారంలో చోటులేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ...తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భావం అన్నది ఒక అవసరం. ఆవశ్యకత కూడా ఉంది. ప్రజల పక్షాన పోరాడాల్సిన పార్టీ ఒకటి ఇప్పుడు తక్షణా వసరంగా ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీలన్నీ తమ సొంత ఎజెండాతో పనిచేస్తున్నాయి. సొంత వ్యవహారాల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి మించి అవినీతి, ఆశ్రిత పక్షపాతంలో కూరుకుపోయాయి. కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ కూడా తెలంగాణకు చేసిందేమీ లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ఊదరగొట్టుడే తప్ప నిలబడి తెలంగాణ పురోగతికి చేసిందేమీ లేదు. నిత్యం విమర్శలు తప్ప మరో ఎజెండా దానికి లేదు. అందుకే గత ఏడాదిగా ప్రజల్లో తిరుగుతూ.. వారి సమస్యలను వింటూ.. సమస్యలపై పోరాడుతూ వస్తున్న కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. గతంలో ఓమారు పార్టీ పెడతామని ప్రకటించిన సమయంలో పార్టీ పేరు గురించి అడిగితే ..అప్రయత్నంగానే టీఆర్ఎస్ పేరు కూడా ఖాళీగా ఉందన్నారు. అయితే అంతా టిఆర్ఎస్ పేరును ఓన్ చేసుకుంటుందని భావించారు. కానీ తెలివిగా టిఆర్ఎస్‌నే ప్రకటించినా.. తెలంగాణ రాష్ట్రసేనగా ప్రకటించి ఆశ్చర్య పరిచారు. ఇది ఓ రకంగా బీఆర్ఎస్ పార్టీకి షాక్ లాంటిదే. టీఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించాలనుకున్న ఆ పార్టీకి ఇదో అశనిపాతం లాంటిదే .నిజానికి గత టీఆర్ఎస్‌లో ఉంటూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్న కవిత మాటలు ముమ్మాటికీ నిజం. జాగృతి ద్వారా తెలంగాణ సాంస్కృతిక దీపాలను వెలిగించారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామంటే అందులో కవితనే కనిపిస్తారు. నిజానికి తెలంగాణ తెచ్చుకుంటే దరిద్రం పోతుందన్న భావనలో ఉండి పోరాడిన వారంతా ఆగమయ్యారు. ఆ కలలు నిజం కాలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించిన వారంతా భంగపడ్డారు. పోరాటంలో ముందున్న కోదండరామ్ లాంటి వారు బయటకు తోయబడ్డారు. ఆయనే మరో పార్టీ పెట్టాల్సి వచ్చింది. కానీ ప్రజల మద్దతుల లేకపోవడంతో ఆయన ఇప్పుడు ఉనికి కోసం పాకులాడుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే శక్తి కూడా లేకుండా పోయింది. తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు బేడీలు పడ్డాయి.. లాఠీలు విరిగాయి. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం గుప్పిట్లో బతికారు. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బిక్కుబిక్కుమంటూ బతికింది. ఇవన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా మార్పు రాలేదు. మార్పు తెచ్చామని, స్వేచ్ఛను ఇచ్చామని ప్రకటించుకున్నా.. అది సాకారంకాలేదు. సామాజిక తెలంగాణ అన్నది నినాదంగా మారింది. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్న కవిత కష్టపడితే.. ఆ పేరు సంపాదించుకోవచ్చు. కేవలం నినాదాల కోసం కాకుండా ప్రజలను అక్కున చేర్చుకునే అమ్మగా మారితే ప్రజలు బ్రహ్మరథం పడతారు. తెలంగాణ ప్రజలు నమ్మితే ప్రాణం ఇస్తారు. ఉద్యమకారులు పోరాడితేనే కొత్త రాష్ట్రం వచ్చింది. అది గుర్తించి కవిత అడుగుల వేయాల్సి ఉంటుంది. మాటలు చెప్పడం వేరు, అందుకు అనుగునంగా అడుగుల వేయడం వేరు. రాజకీయాల్లో చిరస్థాయిగా నిలవాలంటే నిబద్ధత ముఖ్యం. నిజాయితీ అవసరం. నిలబడే ధైర్యం కావాలి. ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలే కాదు.. పనులు చేసే ధైర్యం కనిపించాలి. కవిత ప్రకటించిన ఐదు సూత్రాలను ఆచరణలో పెడితే అద్భుతాలు సాధించవచ్చు. అందుకు కావాల్సిందల్లా ప్రజల పక్షాన పోరాడడం. ఎన్నికలకు మరో రెండేళ్లు గడువు ఉంది. మహిళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయి. మహిళలను, బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తే కవిత తప్పకుండా విజయం సాధిస్తారు. రాజకీయ పార్టీగా ముందు నిలబడతారు. అవినీతి లేకుండా సాగుతారన్న నమ్మకం కూడా ముఖ్యం. అందుకు వీరిందరినీ కలుపుకుని పోవడంతో పాటు, గుంటనక్కలను ఎదుర్కొనే చాణక్యం కూడా ముఖ్యం.

## ఎంతయినా ఒరిజినల్ ..ఒరిజినలే


- కవిత పార్టీపై బీఆర్ఎస్ సెటైర్లు
- అసలు ఒరిజినలే లేదుగా అంటూ టీఆర్ఎస్ ప్రతిదాడి

హైదరాబాద్, నేటిధాత్రి:
కవిత పార్టీపై బీఆర్ఎస్ వ్యంగ్యంగా స్పందించింది. కవిత తన కొత్త పార్టీ పేరును టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన)గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన బీఆర్ఎస్.. ఎంతైనా ఒరిజినల్ ఒరిజినలే అని సెటైర్ వేసింది. కవిత పార్టీ పేరును కాపీ కొట్టిందని అర్థం
వచ్చేలా ట్వీట్ చేసింది. సెటైర్‌గా ఒరిజినల్, డూప్లికేట్ కోల్గేట్, బిస్లెరీ ఫొటోలు షేర్ చేసింది బీఆర్ఎస్. ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే అంటూ బీఆర్ఎస్ పోస్ట్ చేసింది. అయితే టిఆర్ఎస్ అన్న ఒరిజినల్ పార్టీ కూడా ఇప్పుడు తమ వద్ద లేదన్న ఇంగితం కూడా బిఆర్ఎస్ గుర్తించలేదు. ఒరిజినల్ ఉంటే డూప్లికేట్ గుర్తించవచ్చారు. ఒరిజినల్ లేకుండానే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని కొత్తగా ఏర్పాటైన టీఆర్ఎస్ నేతలు అప్పుడే విమర్శలకు పదను పెట్టారు. అంతేగాదు ఆయన ఫామ్‌హౌజ్నుంచి రారు అని కూడా కేసీఆర్‌పై సెటైలర్లు గుప్పించారు.

## టీఆర్ఎస్ ఆవిర్భావంతో

# బీఆర్ఎస్‌కు షాక్

### తమ బ్రాండ్ పోవడంతో నేతల్లో ఆందోళన



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

04 లో

## కార్మికులతో విభేదాలు లేవు

### ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని

04 లో




నిష్పక్షపాత వార్తల నిజరూపం

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY





ఆదివారం 26-04-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 27 రూ॥ 6.00


22th ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

నేటిధాత్రి®

22ND ANNIVERSARY

# 22వ వసంతపు తోరణం

## చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది “అక్షరం”

“నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో “21 మైలు రాళ్లు ” దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ **“22 వ వసంతం”** లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

## “నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో

**మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనసూర్తిగా కోరుకుంటూ....**



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

22ND ANNIVERSARY

వసంతాల అక్షరోద్యమం



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

**Corporate Office Address :**

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# టీఆర్ఎస్ ఆవిర్భావంతో బీఆర్ఎస్‌కు షాక్

## తమ బ్రాండ్ పోవడంతో నేతల్లో ఆందోళన



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ఆవిష్కరించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేనగా అంటే టీఆర్ఎస్‌గా ప్రకటించారు. పార్టీ పేరు బీఆర్ఎస్‌కు షాక్‌కు గురి చేసింది. శనివారం ఉదయం కవిత సర్వ మత ప్రార్థనలు చేశారు. బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరారు. గన్‌పార్కులో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటించారు. అనంతరం.. పార్టీ జెండా విష్కరించారు. ఈ పార్టీ పేరు బీఆర్ఎస్‌ను బిగ్ షాక్‌కు గురి చేసింది. ఇదిలా ఉండగా.. పార్టీ ప్రకటించే సభా ప్రాంగణాన్ని తెలంగాణ కలలు ఉట్టిపడేలా డిజైన్ చేయడం ఆకట్టుకుంది. వరంగల్ కాకతీయ కళా తోరణం ఆకృతిలో ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పులే, ఆచార్య జయశంకర్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. ద్వారానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే ఆలోచన ఉందని ఇటీవలే ఓ సందర్భంలో కేటీఆర్ అన్నారు. ఇప్పుడు టీఆర్ఎస్ ఆవిర్భావంతో వారికి షాక్ తగిలినట్లు అయ్యింది. అంతేగాకుండా తండ్రిని, అన్నను ఆమె టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఫాంహౌస్ వీడి కేసీఆర్ బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ?. అధికారం వచ్చాక ఆయన మమకారం కోల్పోయారు. మారిన మరబొమ్మ కేసీఆర్. మాటల మనిషి, మర మనిషి, మారిన మనిషి కేసీఆర్. ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు. గుంట నక్కల, తోడేళ్ల చేతిలో బందీ అయిన మనిషి. అదే మన కేసీఆర్ అయితే పాలమూరు దగ్గర కుర్చీ వేసుకుని మరీ పనులు పూర్తి చేసేవారు. కేసీఆర్ మారతారేమో అని చూశా. ఇళ్లు, భూములు అమ్ముకుని రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను ఏం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల మీద కర్రలతో దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చారు. ఉద్యమకారులకి మర్యాద ఇచ్చారా?. కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేస్తున్నా. మనకు ప్రాణాలు అడ్డంపెట్టి పోరాడే సైన్యం కావాలి. నేను ఏం తప్పు చేశానని నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాళేశ్వరం మీద మాట్లాడితే సస్పెండ్ చేస్తారా?. అవినీతి చేసిన పందికొక్కులని కేసీఆర్ పక్కన పెట్టుకున్నారు అంటూ విమర్శలు గుప్పించారు.



# కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

హైదరాబాద్, నేటిధాత్రి:
కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపు నిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. 'విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరపున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు. బీజేపీ ప్రజలకోసం పనిచేసే పార్టీ అని రామచంద్రరావు అన్నారు. పార్టీకి కేడర్, లీడర్ ఉన్న పార్టీ అన్నారు. కవిత పార్టీతో తెలంగాణకు ఒరిగేదేమీలేదన్నారు.

# అజారుద్దీన్, కోదండ రామ్‌లకు ఊరట

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, నేటిధాత్రి:
గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు. దీంతో ఈ ఇద్దరు ఇక ఎమ్మెల్సీలుగా కొనసాగనున్నారు.

# కవితకు రాజకీయ సమాధి కట్టింది బీజేపీనే: ఎంపీ అర్వింద్



హైదరాబాద్, నేటిధాత్రి:
సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వారిని, బీజేపీని గెలిపించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. శనివారం కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పిట్టల దొరను చూశారని.. ఇప్పుడు పిట్టల దొరసానిని చూస్తారని వ్యంగ్యంగా విమర్శించారు. కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని గుర్తు చేశారు.
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బీజేపీ మద్దతు లేకుండా వచ్చిందా? అంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇండియా–పాకిస్తాన్ విభజన ప్రక్రియలో ఎంతో మంది చనిపోయారని వివరించారు. వీళ్లు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది చనిపోయారని చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. తేజస్వి వ్యాఖ్యలను బీఆర్ఎస్ కళ్ళద్దాలతో చూడకండంటూ రాజకీయ పార్టీల నేతలకు ఆయన స్పష్టం చేశారు. అజారుద్దీన్ అదృష్టం బాగుందని.. అందువల్ల ఆయన మంత్రి అయ్యారన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం వల్ల అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.

# మే 5నుంచి బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

**●రాత్రి ఒంటిగంట తరవాత కూడా స్వేచ్ఛగా రావచ్చు ●ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా**

కోల్‌కతా, నేటిధాత్రి:
ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. 'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు. గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే. బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించడని అమిత్ షా హామీనిచ్చారు.



# తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరు

## తెలంగాణ ప్రజలను... కవిత తప్పుదోవ పట్టిస్తున్నారు: కిరణ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ వేదికగా కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని చెప్పుకొచ్చారు.

**కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారు..**

నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు.

**కవిత.. నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తాం..**

కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా ఆమె పని చేశారని ప్రస్తావించారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

# అస్వస్థకు గురైన గవర్నర్ నజీర్

**●మణిపాల్ ఆస్పత్రిలో పరీక్షలు..డిశ్చార్జ్ ●విషయం తెలిసి లోక్‌భవన్‌కు వెళ్లి బాబు పరామర్శ**

విజయవాడ, నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అస్వస్థతకు గురయ్యారు. కడుపులో తీవ్ర నొప్పి రావడంతో ఆయనను విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్.. బెంగళూరు నుంచి విజయవాడకు రావాల్సి ఉండగా, ఆయన ప్రయాణిస్తున్న విమానం ఆలస్యమైంది. రాత్రి 12 గంటలకు చేరుకోవాల్సిన విమానం ఆలస్యంగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో విజయవాడకు చేరుకుంది. అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో తెల్లవారుఝామున సుమారు 4:30 గంటలకు గవర్నర్‌కు కడుపులో నొప్పి ప్రారంభమైంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. వైద్య పరీక్షల అనంతరం మాణిపాల్ ఆసుపత్రి నుంచి తన నివాసానికి చేరుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్.. జర్నీ ప్రభావం, అర్ధరాత్రి ఆలస్యం కావడం లాంటి చిన్న కారణాల వలన అస్వస్థతకు గురైనట్టుగా తెలుస్తోంది.. అయితే కిడ్నీలో రాళ్లు ఉన్నాయని, ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని ఆసుపత్రి వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. గవర్నర్ వైద్య పరీక్షల్లో కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు.. శస్త్రచికిత్స ద్వారా వాటిని తొలగించాలని సూచించారు. ఇవాళ ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నాయని చెప్పిన గవర్నర్.. మరోసారి ఆసుపత్రికి వస్తానని చెప్పి వెళ్లిపోయారు.విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోక్ భవన్‌కు వెళ్లారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో సీఎం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. స్వల్ప అస్వస్థత కారణంగా గవర్నర్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన విషయం తెలిసి, లోక్ భవన్‌కు చేరుకున్న సీఎం.. గవర్నర్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.



# కార్మికులతో విభేదాలు లేవు

**ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపామని, వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరించామని పేర్కొన్నారు. ఈరోజు (శనివారం) ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు. అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికుల చిరకాల స్వప్నమని, దాన్ని తాము నెరవేర్చామని పేర్కొన్నారు.

**మిగిలిన సమస్యలనూ పరిష్కరిస్తాం..**

అలాగే కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించడం వంటి అంశాలపై ఆర్టీసీ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నిర్ణయాలను చారిత్రాత్మకంగా అభివర్ణిస్తూ కార్మికులు సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించారని.. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కేడర్ కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలపాటు కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ఇంకా మిగిలిన సమస్యలనూ కూడా దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేసినా, వారి డిమాండ్లు నెరవేర్చలేదని విమర్శించారు.

**మా ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవు..**

ఆ సమయంలో 30 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవని, వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నామని చెప్పారు. సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ శవ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరించిన తీరు సరికాదని అభిప్రాయపడ్డారు. 2013 బాండ్లు, 2017 పీఆర్సీ, డీఏలు, సీసీఎస్, పీఎఫ్ బకాయిల చెల్లింపులు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, కారుణ్య నియామకాలు వంటి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్వీసు నుంచి తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నామని ప్రస్తావించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఆర్టీసీ ఒక లైఫ్ లైన్‌లా పనిచేస్తోందని మంత్రి పొన్న ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు



**●పోలవరం ద్వారా గోదావరి జలాల తరలింపు**
**●అనకాపల్లి పరిశ్రమలకు ఇదే ఆధారం**
**●మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**

కాకినాడ, నేటిధాత్రి:
ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో గోదావరి జలాలు ఎంతో కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా అక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల దగ్గర హైవే క్రాసింగ్ వంతెనల నిర్మాణ పనులనూ మంత్రి నిమ్మల పర్యవేక్షించారు. అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో పోలవరం ఎల్ఎంసీ పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. జూన్ నాటికి మొదటి దశ పనులు పూర్తి చేసి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.
నేషనల్ హైవేల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పనులు ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదని అధికారులు, ఏజెన్సీలను మంత్రి సున్నితంగా హెచ్చరించారు. ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు గోదావరి జలాలు కీలకమన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించడానికి పోలవరం ఎడమ ప్రధాన కాలువే ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా ఈ నీటిని అందిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని మంత్రి నిమ్మల ఆరోపించారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులను ప్రీ క్లోజర్ చేసి ఉత్తరాంధ్ర ప్రజలపై జగన్ గత ప్రభుత్వం కక్ష్య కట్టిందని మండిపడ్డారు. పోలవరం ఎడమ కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గిస్తూ ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు నాడు జగన్ గండికొట్టారని మంత్రి నిమ్మల ఆగ్రహించారు. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తే, రెండో ప్రాధాన్యతగా లెఫ్ట్ కెనాల్ పనులను పరిశీలించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా పనులు పూర్తి చేస్తున్నట్లు మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఇప్పటివరకూ పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 76 శాతం పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవలోని 472 కుటుంబాలకు తమ ప్రభుత్వం రూ.30.38 కోట్ల పరిహారం అందించినట్లు వెల్లడించారు. పోలవరం ఎడమ కాలువ మొదటి నుంచి తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండి 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని నిమ్మల తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ప్రవహించే మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మంది జనాభాకు తాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. పాయకారావుపేటకి ఎగువన ఉన్న 98 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

**●ఈగిల్‌లో డేటా సెంటర్ ఏర్పాటు**
**●ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా**

అమరావతి, నేటిధాత్రి:
డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు అతి త్వరలో ఈగల్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. శనివారం మంగళగిరిలో ఈగల్ హెడ్ క్వార్టర్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఏడాదిన్నర క్రితం ఈగల్ వింగ్‌ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. పని తీరుతో ఈగల్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఈగల్‌ను ప్రీమియర్ ఆర్గనైజేషన్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. గంజాయి పెంపకం, ఉత్పత్తిను నిరోధించేందుకు.. అలాగే ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్) అమలు చేయడంలో ఈగల్ ముందుందని వివరించారు. గతంలో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ తరహాలోనే ఈగల్ కూడా బాగా రాణిస్తుందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి సాగు జీరో చేయగలిగారని చెప్పారు. భవిష్యత్తులో ఈగల్ టీం మరింత యాక్టివ్‌గా పని చేస్తుందని పేర్కొన్నారు. డ్రోన్లు, శాటిలైట్లతో గంజాయి నిర్మూలన చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ వినియోగించే వారిపై ఫోకస్ పెడుతున్నామని ఏపీ డీజీపీ తెలిపారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నా మన్నారు. డ్రగ్స్, గంజాయిని ఎవరు వినియోగిస్తున్నారు? ఎందుకు వినియోగిస్తున్నారనే కోణంపై దృష్టి సారించామని పేర్కొన్నారు. మొదటి దశలో 10 వేల టెస్టింగ్ కిట్స్ వినియోగించామన్నారు. అలాగే డ్రగ్స్ వినియోగించే వారు.. పేమెంట్స్ ఎలా చేస్తున్నారు? ఎక్కడ నుంచి వాటిని తీసుకు వస్తున్నారు? అనే విషయాలను కూడా పరిశీలిస్తున్నామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరించారు. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ లక్ష్యంగా ఈగల్ చర్యలు చేపడుతుందని చెప్పారు. ఇంటర్ స్టేట్ డ్రగ్ నెట్ వర్క్‌లపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. 13 కొత్త ఎన్‌డీపీఎస్ కోర్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు వేల డ్రగ్స్ కేసులు ఉన్నాయని.. అవి ట్రయిల్‌లో ఉన్నాయని గణాంకాలతో సహా డీజీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఐ.జి రవికృష్ణతోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు భారీ దెబ్బ.. 47 మంది లొంగుబాటు

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో మావోయిస్టు ఉద్యమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు.
లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో LMG, AK-47, INSAS, SLR రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో PLGA బెటాలియన్‌కు చెందిన 4 మంది, DKSZCకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు.

# మంత్రి బండి సంజయ్‌ని కలిసిన కౌన్సిలర్ విజయ్



**పరకాల, నేటిధాత్రి:** పట్టణ మున్సిపాలిటీకి చెందిన 15వ వార్డ్ కౌన్సిలర్‌గా ఇటీవల విజయం సాధించిన కుక్కల విజయ్ శనివారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.కౌన్సిలర్‌గా ఎన్నికైన అనంతరం తొలిసారిగా ఆయనను కలుసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుక్కల విజయ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కుక్కల విజయ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కలవడం నాకు ఎంతో ఆనందంగా ఉందని మున్సిపల్ 15వ వార్డ్ కౌన్సిలర్‌గా నాకు ప్రజలు ఇచ్చిన మద్దతు మరింత బాధ్యతను పెంచిందని నా విజయాన్ని అభినందించి శాలువాతో సత్కరించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.పట్టణ అభివృద్ధి కోసం,ముఖ్యంగా నా వార్డ్‌లోని ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తాను.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పారదర్శకంగా సేవలందిస్తానని తెలిపారు.

# ప్రెస్ క్లబ్ క్యాతనపల్లి నూతన కమిటీ ఎన్నిక..



**▶▶జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా..... ▶▶ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పి. గట్టయ్య**

**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** ప్రెస్ క్లబ్ క్యాతనపల్లి నూతన కార్యవర్గాన్ని శనివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు పిలుమల్ల గట్టయ్య (మెట్రో ఈవినింగ్), ప్రధాన కార్యదర్శి మారపల్లి వేణుగోపాల్ రెడ్డి (ఆంధ్రప్రభ), కోశాధికారి అరెల్లి గోపికృష్ణ (మన సమాజం), లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారుగా ఈదునూరి సారంగారావు ( జనం సాక్షి), గౌరవాధ్యక్షులు ఆరంధ స్వామి ( సిటీ కేబుల్), వెంగళదాస్ సంతోష్ (మనం), తాంద్ర సతీష్ (ఆంధ్రజ్యోతి), వర్కింగ్ ప్రెసిడెంట్ కలువల శ్రీనివాస్( జర్నలిస్ట్ ),ప్రచార కార్యదర్శి గా నాంపల్లి గట్టయ్య (నేటిధాత్రి), ఉపాధ్యక్షులు గంగారపు గౌతమ్ కుమార్ (ప్రజా పక్షం), పిడి రాజేంద్ర ప్రసాద్ (తెలంగాణ గళం), కొండ శ్రీనివాస్ (మన తెలంగాణ), బండ అమర్నాథ్ రెడ్డి (వుదయం), పురుషోత్తం గంగులు (ప్రజా దర్బార్), సహాయ కార్యదర్శులుగా నెల్లూరి శ్రీనాథ్ ( సూర్య), నాసబత్తుల ప్రవీణ్ (నవ తెలంగాణ), దాసరి స్వామి (ప్రత్యక్ష సాక్షి) , ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొమ్ము సదానందం( విజయ భారతీ), దుర్గం వెంకట స్వామి( టుడేస్ న్యూస్),మోరె రవీందర్(టీ మీడియా) లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షులు గట్టయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు, ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ క్యాతనపల్లిని ఆదర్శ ప్రెస్ క్లబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. నూతన కమిటీని సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు..

# తెలంగాణలో ఎరువుల డీలర్ల బంద్ పిలుపు

**▶▶పట్టణ,గ్రామాల డీలర్లు అందరం కలిసి ఐక్యత చాటాలి... ▶▶రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు....**



**పరకాల, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల డీలర్లు ఏప్రిల్ 27న రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చారు.ఎరువుల ఉత్పత్తిదారుల అన్యాయ విధానాలకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



వెల్లడించింది.హైదరాబాద్‌లోని బాబు ఖాన్ ఎస్టేట్స్‌లో రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా డీలర్లు తమ సమస్యలను ప్రస్తావిస్తూ కీలక డిమాండ్లు చేశారు.ఎరువుల సరఫరాపై వెంటనే ఎఫ్ఓఎల్ విధానం అమలు చేయాలని,ఎలాంటి లింక్ ప్రొడక్ట్స్ లేకుండా ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 27న రాష్ట్రంలోని అన్ని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్,సీడ్స్ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నిజిల్లాలు,మండలాలు,గ్రామాల డీలర్లు ఐక్యంగా ముందుకు వచ్చి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.మన హక్కుల కోసం మన ఐక్యతే ఆయుధమని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్ రావు,రాష్ట్ర కోశాధికారి సిద్ధి నాగరాజు,పరకాల మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు,కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్



**నడికూడ, నేటిధాత్రి:** పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లె గ్రామంలో పిఎసిఎస్,ఐకెపి ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులను ఆర్థికంగా బలపరచడం, మహిళలను సాధికారత వైపు నడిపించడం లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన పథకాలలో భాగంగా ఐకెపి ద్వారా కొనుగోలు కేంద్రాలను నిర్వహించడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.గత కొన్నేళ్లలో లేనివిధంగా మక్క కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మంచి ధరలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి,ఏఓ పోరిక జైసింగ్, సొసైటీ ఇన్‌చార్జ్ జ్యోతి, ఏఈఓలు రామకృష్ణ,ప్రదీప్, కాంగ్రెస్ సమన్వయ సమితి సభ్యులు పర్నం మల్లారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎరుకల అంజిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెద్ద బోయిన రవీందర్ యాదవ్,సీసీ హేమలత, చైతన్య గ్రామైక్య మహిళా సంగం వివో స్వప్న, సభ్యులు హరిత, సంధ్య, ఓబీలు అనిత, వివో ఏ. సుమలత, ఏపిఎం నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పాలనలో రైతులకు ఎలాంటి కష్టాలు రాలే

**▶▶ఒక విజన్ తో పాలించిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్....**

**▶▶ప్రజా సంక్షేమాన్ని మరిచి పాలన సాగిస్తున్న అధికార పార్టీ...**



**కేసముద్రం, నేటిధాత్రి:** శనివారం పత్రిక మిత్రుల సమావేశంలో బి ఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ నియోజకవర్గపు ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది, ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ నజీర్ అహ్మద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలుమాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర సాధకులు తెలంగాణ అభివృద్ధి ప్రదాత ప్రజా సంక్షేమ ప్రదాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు, ఈ రాష్ట్ర రైతన్నకి కాళేశ్వరం అనే బృహత్తర ఎత్తిపోతల పథకం ప్రపంచంలోనే



ఎక్కడలేని విధంగా దాని నిర్మించి తెలంగాణ రాష్ట్రంలో అన్ని గొలుసు కట్టు చెరువులకు నీళ్లు అందించి భూగర్భ జలాలను పెంచారని రైతుల యొక్క కష్టాలను దృష్టిలో పెట్టుకొని రైతుబంధు నిరంతరం 24 గంటలు విద్యుత్ సరఫరా పండిన పంటలను ప్రభుత్వం పరంగా కొనుగోలు చేసి రైతుకు కష్టం లేకుండా చేసినారని దీనిని చూసి ప్రజాదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ బి ఆర్ఎస్ పార్టీ నేతలకు నానా ఇబ్బంది పెట్టుకుంటూ లేనిపోని కమిషన్లు వేసి కేసులు పెట్టిన కోర్టుల చుట్టూ తిప్పుతూ చేసిన అభివృద్ధి పద్ధతిగా లేదని తిరస్కరించి ప్రజల్లో దుష్ప్రచారం నిర్వహిస్తుందని, ప్రభుత్వం వేసిన అర్జీలను హైకోర్టు గత పాలకుల తప్పులేదని తేల్చి చెప్పిందని. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది చెంప పెట్టని కాళేశ్వరాన్ని ఏదో ఒక పిల్ల క్రాకులు వస్తే ఇది కూలిపోయిందని పనికిరాదని ప్రచారం నిర్వహిస్తూ ఎన్ని రోజులు ప్రజాసంక్షేమాన్ని మరిచి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబెట్టారు. ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఈరోజు వారి ఆత్మహత్యలకు చావులకు దారి చూపెట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచి అన్ని వర్గాల ప్రయోజనాన్ని తాకట్టు పెట్టి ఈరోజు ప్రజాపాలనాన్ని కొనసాగిస్తున్నారని ఎండగట్టారు. అన్ని వర్గాలకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించకుండా తప్పుడు ప్రచారాలు నిర్వహించుకుంటూ గత పాలకులను నిందించడమే ఏకైక ఎజెండా గా పెట్టుకుని పరిపాలన కొనసాగిస్తున్నారని ఇప్పటినుంచి రైతులకు గాని ఉద్యోగస్తులకు గాని ఎలాంటి ఆపద వచ్చిన బి ఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాడుతుందని గంటపదంగా చెబుతున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలు నెరవేర్చాలని నెరవేర్చకుంటే ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని మండల పార్టీ కచ్చరిస్తుందని తెలిపారు. మొక్కజొన్న రైతులకు వారి మొక్కజొన్నలను కొని ఆదుకోవాలని మండల పార్టీ కోరుతున్నదని రైతులకు నిరంతరం విద్యుత్తు నీరు అందించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలుపాలని మండల పార్టీ కోరుతున్నదని ఆర్టీసీ కార్మికుల కోరికలను వెంటనే అమలు చేయాలని మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు ఒక్క ఉద్యోగం ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తుందని అన్నారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించి వారికి ఆదుకోవాలని అన్నారు. నిరుద్యోగ యువతను ఉద్యోగాలు ఇచ్చివారి జీవితాలకు వెలుగు నింపాలని అన్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో బి ఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రజలు ఎలాంటి అపోహల గురి కాకుండా ధైర్యంగా ఉండాలని అన్ని వర్గాల ప్రజలను కోరినారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, టౌన్ పార్టీ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్ , ఊకంటి యాకూబ్ రెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్లు జాటోత్ సుజాత హరినాయక్ రావుల వినయ్ రెడ్డి, ఆగే రాము ,దూదేపాక కృష్ణ ,మేకల శారద సురేష్ ,పైరాల శరత్ , పురం రాజమణి రమేష్ , సర్పంచులు ఈసం లక్ష్మీనారాయణ, ఎదరబోయిన సూరయ్య బాలాజీ,జ్యోతి శ్రీనివాస్ , మాజీ సర్పంచులు హరి రామ్ ముఖ్య నాయకులు పందుల సంజీవ తోట శీను బానోత్ వెంకన్న మాజీ ఎంపిటిసిలు కొమ్ము రాహులు, దుబ్బాక వెంకన్న , చందు, యనమల్ల ప్రభాకర్ ,రాయుడు కూన భద్రాద్రి, లింగాల పిచ్చయ్య, బద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మం ప్రపంచానికే ఆదర్శం



**▶▶హిందూ ధర్మాన్ని పరిరక్షించే బాధ్యత అందరిదీ....**

**▶▶హిందూ ధర్మ సమ్మేళన సమితి కమిటీ ప్రకటన-అధ్యక్షుడుగా సింగిరికొండ మాధవశంకర్....**

**▶▶మే 5 న హిందూ ధర్మ సమ్మేళనం వాల్ పోస్టర్ ఆవిష్కరణ...**

**నర్సంపేట, నేటిధాత్రి:** హైందవ సంస్కృతి,హిందూ ధర్మం సాంప్రదాయాలు నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని హిందూ ధర్మ సమ్మేళన సమితి నర్సంపేట అధ్యక్షుడు సింగిరికొండ మాధవశంకర్ అన్నారు.నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలో హిందూ ధర్మ సమ్మేళన సమితి నర్సంపేట కమిటీని ప్రకటించారు.సమితి గౌరవ అధ్యక్షుడు మోతే సమ్మిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సింగిరికొండ మాధవ శంకర్ మాట్లాడుతూ హిందువుగా గర్వించు హిందువుగా జీవించు అనే నినాదంతో ముందుకు పోతున్నదని తెలిపారు. హిందూ సంప్రదాయాలు, ఆచారాల పట్ల హిందూ ధర్మ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. హైందవ ధర్మాన్ని పూర్తిస్థాయిలో విశ్లేషణ చేయడం కోసం తమ్మేళన కార్యక్రమాలు తప్పనిసరి అని అన్నారు. ఇనుగులపై మతమార్పిడిలను అరికట్టేందుకు గాను హిందూ సాంప్రదాయాలను కాపాడడానికి ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమం పట్ల గడపగడపకు కలపత్రం ప్రచార కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మే నెల నర్సంపేట పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగే హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా మాధవశంకర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సహాయఅధ్యక్షురాలు దార్ల రమాదేవి, ప్రధాన కార్యదర్శి పోలబోయిన మురళీధర్,ఉపాధ్యక్షులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఆర్షనపెల్లి మోహన్ రావు,సైఫా సురేష్, చింతల కమలాకర్ రెడ్డి, వేములపల్లి సుబ్బారావు, ద్యాగల శ్రీనివాస్, వాసు నాయక్, కొల్లూరి లక్ష్మీనారాయణ, నిర్వహణ కార్యదర్శి దొడ్డ రవీందర్, కోశాధికారి మేడారపు కమలాకర్, సహకోశాధికారి పాండ్య రమేష్, ప్రచార కార్యదర్శి లు మహాదేవుని జగదీష్, మల్యాల ప్రవీణ్ కుమార్, మల్యాల వినయ్ కుమార్, కృష్ణారావు, గుడిపూడి అరుణ,ముస్కు నీరజ,అపరదపు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# దశ దిన ఖర్మలకు శ్రీ రామ కృష్ణ సేవా ట్రస్ట్ ఆర్థిక సహాయం



**బాధిత కుటుంబాన్ని పరామర్శించి,ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేసిన శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ ఛైర్మెన్ బాడిశ నాగరమేష్**

**మంగపేట, నేటిధాత్రి:** ములుగు జిల్లా మంగపేట మండలం పాలయి గూడెం గ్రామం లో జక్కా నర్సింహా రావు తల్లి జక్కా కాంతమ్మ ఇటీవల అనారోగ్యం కారణాల వల్ల మరణించగా గ్రామస్తుల నుండి విషయం తెలుసు కున్న శ్రీ రామ కృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేష్ కాంతమ్మ దశ దిన ఖర్మలకు విచ్చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికీ మనోధైర్యం చెప్పి 5000రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.పిలవగానే వెంటనే వచ్చి సహాయం చేసిన నాగరమేష్ కి అక్కడి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియ జేశారు .

# ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న.. సర్పంచ్ దుబ్బ (గున్నెల) శ్రీను



**వెల్దండ, నేటిధాత్రి:** కల్వకుర్తి నియోజకవర్గం లోని వెల్దండ మండలంలోని రాచూరు గ్రామ సర్పంచ్ గున్నెల శ్రీనివాస్ తన ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో విజయం సాధిస్తే.. గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లికి ?10,116 నగదు కానుకగా అందజేస్తానని ఇచ్చిన మాటను ఆయన అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా.. కొంగళ్ళ శ్యామలమ్మడైలెన్ దంపతుల రెండవ కుమార్తె చిత్ర వివాహ సందర్భంగా.. శనివారం సర్పంచ్ రూ. 10,116 నగదు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్ రెడ్డి, గంగదారి రమేష్.. గంగదారి శ్రీనివాస్, మదార్, రాజశేఖర్, పాండు, శ్రీశైలం శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ వినయ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**▶▶కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు...**

**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్ర మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ రావుల వినయ్ రెడ్డి 33 వ జన్మదిన వేడుకలు మండల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం వినయ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ మృదుస్వభావి తన ప్రజలకు అత్యంత సన్నిహితంగా ఉంటూ ప్రజా ఆదరణ పొందుతూ ప్రజల కష్టాల్లో పాలు పంచుకుంటూ తనకంటూ ఒక విజన్ ఏర్పరచుకున్న వ్యక్తిగా అతి తక్కువ సమయంలో గుర్తింపు తెచ్చుకున్న మంచి రాజకీయ భవిష్యత్తు ఏర్పాటు చేసుకుంటూ ముందుకు పోతున్న రావుల వినయ్ రెడ్డికి తన పుట్టినరోజు సందర్భంగా పార్టీ నాయకులు మాజీ జడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, మండల పార్టీ కార్యదర్శి కముటం శ్రీనివాస్, మాసాడి శ్రీనివాస్, మేకల సురేష్, తోట శ్రీనివాస్ మాజీ సర్పంచ్ ప్రభాకర్, కొమ్ము రాహుల్, కముటం శ్రీరంగం నాగుల్ పాషా, బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు హరి నాయక్,పాయిరాల శరత్, ఆగే రాము, దూదేపాక కృష్ణ, రమేష్ పార్టీ అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# హిందూ ధర్మ సమ్మేళనానికి మున్సిపల్ చైర్మన్,కమిషనర్‌కు ఆహ్వానం



**పరకాల, నేటిధాత్రి:** ఈనెల 28న పరకాల పట్టణంలో నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనానికి మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్,మున్సిపల్ కమిషనర్ అంజయ్యలను హిందూ ధర్మసమ్మేళన సమితి సభ్యులుమర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు సమ్మేళనం లక్ష్యాలను వివరించి,హిందూ



సంప్రదాయాలు,ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమం విజయవంతానికి మున్సిపల్ యంత్రాంగం సహకారం అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ సమ్మేళన సమితి అధ్యక్షులు కొలుగూరి రాజేశ్వంరావు,గౌరవ అధ్యక్షులు డాక్టర్.నాగబండి విద్యాసాగర్,ఉపాధ్యక్షులు పాపిరెడ్డి పల్నాటి సతీష్,మామిడి రమేష్ పాల్గొన్నారు.

# జాతీయ జర్నలిస్టుల సమావేశం విజయవంతం




▶▶ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన కార్యక్రమం.

**భూపాలపల్లి, నేటిధాత్రి:** తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హైదరాబాద్ ఆర్టీసీ ఎక్స్ రోడ్లో నిర్వహించిన నేషనల్ యూనియన్ ఆఫ్ ఇండియా జాతీయ జర్నలిస్టుల సమావేశాలు విజయవంతమయ్యాయని టీఎస్ జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్,భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ తెలిపారు. ఈ సమావేశాలకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి జర్నలిస్టు ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో టిఎస్జేయూ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు,సంక్షేమం,భద్రత,హక్కుల సాధన వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో పలువురు రాష్ట్రాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెల్లడించగా,జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక సూచనలు వచ్చినట్లు చెప్పారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యా రాయితీలు,హెల్త్ కార్డులు,గృహ పథకాలు,బీమా,పెన్షన్ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు వివరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జర్నలిస్టు నాయకులకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సమావేశాలు జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని, టీఎస్జేయూ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్ నేతృత్వంలో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ వైఖరి మహిళా వ్యతిరేకం

▶▶బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి... ▶▶మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు-2026 ను అడ్డుకోవడం ప్రజాస్వామ్య ద్రోహం... ▶▶2029 నాటికే రిజర్వేషన్లు అమలు చేయాలన్న మోదీ సంకల్పానికి అడ్డంకులు....

**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, హనుమకొండ రాంనగర్ కార్పొరేటర్ చాడ స్వాతి, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ గండి దేశ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు-2026'ను కాంగ్రెస్ అడ్డుకోవడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. లోక్‌సభలో కాంగ్రెస్ అడ్డుకున్నది కేవలం ఒక బిల్లును మాత్రమే కాదని, కోట్లాది మంది ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని రాజకీయ భవిష్యత్తును అని ధ్వజమెత్తారు.?2029 సాధారణ ఎన్నికల నాటికే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలనే దృఢ సంకల్పంతో కేంద్రం అడుగులు వేస్తుంటే, రాజకీయ లబ్ధి కోసం, క్రెడిట్ రాకూడదనే అహంకారంతో విపక్షాలు దీనిని అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. మహిళా శక్తి వందన అధినియం బిల్లుపై కాంగ్రెస్ కూటమి తీరు చూస్తుంటే అది 'మహిళా వ్యతిరేక కూటమి' అని స్పష్టమవుతోందని అన్నారు. దశాబ్దాల నిర్లక్ష్యం"దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ మహిళా బిల్లును కేవలం ఎన్నికల హామీలకే పరిమితం చేసింది తప్ప, చిత్తశుద్ధితో ఎన్నడూ అమలు చేయలేదు. మోదీ , అమిత్ షా ప్రతిపక్షాల ప్రశ్నలకు పార్లమెంటులో స్పష్టమైన సమాధానాలిచ్చినా, మొండి వైఖరితో అడ్డుతగలడం దేశ మహిళలకు చేస్తున్న ద్రోహం" అని నాయకులు పేర్కొన్నారు. మహిళలే తగిన బుద్ధి చెబుతారు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు కల్పించే ఈ చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ మరియు వారి మిత్రపక్షాలకు రాబోయే రోజుల్లో మహిళా లోకం తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. మహిళల గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ



కార్యక్రమంలో పార్లమెంట్ కో-కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, పెండ్యాల రాజు, రాష్ట్ర నాయకులు బట్టు రవి, అర్బన్ అధ్యక్షులు గీస సంపత్, 6వ వార్డు కౌన్సిలర్ ఎరుకల రేణుక, మీడియా ఇంచార్జ్ మునెందర్ , బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, రూరల్ అధ్యక్షులు పులిబిడ్డ రాజు,మహిళా మోర్చా నాయకురాలు బూర పద్మ, నాయకులు పొన్నాల కొమరన్న, శ్రీనివాస్, తాటికంటి రవికుమార్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహణ.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాలమండలంలోని ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈరోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం భాగంగా మరియు ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. హెచ్. మధుసూదన్ మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సందీప్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రజలకు మలేరియా వ్యాధి నివారణపై కీలక సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా వ్యాధి ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు వల్ల వస్తుందని తెలిపారు. తీవ్రమైన జ్వరం, చలి వణుకులు వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. సరైన సమయంలో పరీక్షలు చేయించుకుంటే మలేరియాను పూర్తిగా నయం చేయవచ్చని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స అందుబాటులో ఉందని వివరించారు. మలేరియా నివారణ కోసం ప్రజలు తమ పరిసరాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల పెరుగుదలను అరికట్టాలని సూచించారు. దోమతెరలు ఉపయోగించడం, ప్రతి మంగళవారం మరియు శుక్రవారం "డ్రై డే" పాటించడం ద్వారా దోమల నియంత్రణ సాధ్యమని పేర్కొన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆశా కార్యకర్తలు లేదా ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సుధాకర్ గ, జిల్లా అకడమిక్ రమేష్ సబ్ యూనిట్ అధికారులు హలీం గారు, ఇతర వైద్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు మరియు జిల్లా ఎపిడమిక్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

▶▶సిఐటియు జిల్లా కార్యదర్శి బందు సాయిలు, చెన్నూరి రమేష్,



**భూపాలపల్లి, నేటిధాత్రి:** మేడే వారోత్సవాలనే ఘనంగా నిర్వహించండి. గ్రామ గ్రామాన పల్లె పల్లెనా మేడే ఎర్రజెండా ఎగరాలి. మేడే సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించండి. బందు సాయిలు, చెన్నూరి రమేష్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని గ్రామాల్లో పల్లె పల్లెనా ఈ సంవత్సరం మేడే వారోత్సవాల్ని ఘనంగా నిర్వహించాలని సిఐటియు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బందు సాయిలు, చెన్నూరి రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అసంఘటితరంగా కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని రక్షించాలని, కేంద్ర బిజెపి సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ సంవత్సరం కార్మిక వర్గం గ్రామ గ్రామాన పల్లె పల్లెనా సిఐటియు ఎర్రజెండాను మేడే సందర్భంగా కార్మికులందరినీ కలుపుకొని నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# చలో ఇందిరా పార్కు ధర్నాను విజయవంతం చేయండి



**భూపాలపల్లి, నేటిధాత్రి:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో "చలో ఇందిరా పార్క్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ, విద్య హక్కు చట్టం--2009 అమలు కోసం హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో భారీ స్థాయిలో ధర్నా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల తల్లిదండ్రులు లక్షలాదిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా నుండి కూడా భారీగా తరలిరావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎల్కేజీ సీటు పొందాలంటే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పుస్తకాలు, యూనిఫామ్, బెల్ట్, బూట్లు తదితరాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి. ఈ భారాన్ని భరించలేక ప్రజలు అప్పులపాలు అవుతూ, తమ ఆస్తులు అమ్ముకునే దుస్థితి ఏర్పడింది.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ విద్యా దోపిడీ ఇప్పటికే ఆగిపోయేదని, కానీ పాలకుల అండదండలతో విద్యా మాఫియా రెచ్చిపోతుందని రవి పటేల్ విమర్శించారు. విద్య హక్కు చట్టం--2009ను పూర్తిగా అమలు చేస్తే సామాన్యుడి బిడ్డ కూడా కార్పొరేట్ పాఠశాలలో ఉచితంగా చదువుకునే అవకాశం లభిస్తుందని, ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై నియంత్రణ ఏర్పడుతుందని, విద్యా వ్యవస్థలో జవాబుదారితనం పెరుగుతుందని తెలిపారు. తెలంగాణ సమాజం ఇకనైనా మేల్కొని, పిల్లల విద్య కోసం అప్పులపాలు కావడం ఆపాలని ఆయన పిలుపునిచ్చారు. "చదువు అమ్ముకునే వస్తువు కాదు -- ఇది ప్రతి బిడ్డ హక్కు" అని స్పష్టం చేశారు. తెలంగాణలో వెంటనే విద్య హక్కు చట్టం అమలు చేయాలని, ప్రైవేట్ విద్యా దోపిడిని అరికట్టాలని, పేదవారి పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య అందే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అందువల్ల విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున రేపు ఉదయం 9 గంటలకు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మన హక్కులను సాధించాలంటే మరో ఉద్యమం తప్పదని, అందరం కలసి పోరాడాలని రవి పటేల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, మడే సంతోష్, వైద్య లక్ష్మణ్, రామ్ చరణ్, రేణుకుంట్ల సునీల్, లక్ష్మణ్ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎస్సార్



**భూపాలపల్లి, నేటిధాత్రి:** శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి మండలంలోని వేషాలపల్లి, కాసింపల్లి, గొర్లవేడు, వజినపల్లి, నేరేడు పల్లి, గుడాడ్ పల్లి, కొంపల్లి, ఫుల్లూరి రామయ్య పల్లి గ్రామాలలో పి.ఎ.సి.ఎస్ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర 2389/- రూపాయలతో పాటుగా బోనస్ 500 రూపాయలు ఇస్తుందని తెలిపారు, వ్యవసాయ శాఖ అధికారులు కోత మిషన్ల యొక్క ఆర్పిఎం 18 నుండి 20 వరకు మరియు బ్లోయర్ ఆన్ లో ఉంచే విధంగా కోత మిషన్ యజమానులకు తెలియజేయాలని ఇలా చేయడం వల్ల ధాన్యంలో తాలు ఉండదని తెలిపారు రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తి జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతులకు సమయానికి డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు అలాగే కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా అధికారులు రాములు కిరణ్ కుమార్ వ్యవసాయ శాఖ ఏఈ సతీష్ భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ కొమురయ్య వైస్ చైర్మన్, అంబాల శ్రీనివాస్ జిల్లా ఆర్టిఏ మెంబర్, రామచంద్రయ్య తాసిల్దార్ లక్ష్మీ రాజయ్య కొంపల్లి సర్పంచ్ శ్రీకాంత్ కౌన్సిలర్లు,స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు



▶▶జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, నేటిధాత్రి:** అర్హులైన పాత్రికేయులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం మధ్య సమాచార వారధులుగా పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తారని, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. 2026 2028 సంవత్సరాలకు చెల్లుబాటు అయ్యే అక్రిడిటేషన్ కార్డుల కోసం ఆన్లైన్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డీపీఆర్వో ఆన్లైన్ దరఖాస్తుల ప్రక్రియపై వివరాలు వెల్లడించారు. దరఖాస్తుల పరిశీలనలో సంస్థ గుర్తింపు పత్రం, విద్యార్హతలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు మీడియా ప్రతినిధుల నుంచి 330 ఆన్లైన్ దరఖాస్తులు అందాయని, వాటిని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిశీలించాలని డీపీఆర్వోను ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీపీఆర్వో శీలం శ్రీనివాస్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు క్యాతం సతీష్ కుమార్, మంతెన సమ్మయ్య, ఎర్రం సతీష్ కుమార్, మోబిన్ అహ్మద్, జి. సారేశ్వరరావు, పాలకుర్తి మధు తదితరులు పాల్గొన్నారు. సామంతుల శ్యామ్ ప్రసాద్, జల్దీ రమేష్, మహమ్మద్ షమీ, అజ్మీర డాకు నాయక్ సమావేశానికి హాజరు కాలేకపోయారు. వారు అన్నారు

# ఘనంగా ప్రపంచం మలేరియా దినోత్సవం






**గుండాల, నేటిధాత్రి:** ప్రపంచ మలేరియా దినోత్సవం గుండాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ పాల్గొని గుండాల పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా అనేది దోమల ద్వారా వ్యాప్తి చెందే ప్రమాదకర వ్యాధి అని, ముఖ్యంగా వర్షాకాలం నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దీని వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మలేరియాను సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మలేరియాను అంతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. 2030 సంవత్సరం కల్లా మలేరియా రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అందుకుగాను ప్రభుత్వం మలేరియా నిర్మూల కోసం పలు కార్యక్రమాలు చేపడుతూ ఆ దిశగా పయనించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సుదీప్,సబ్ యూనిట్ అధికారి భద్రు,హెల్త్ సూపర్వైజర్ రాజు,హెచ్ వి భూలక్ష్మి, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ సత్యం, ఎల్ టి దేవా, హెల్త్ అసిస్టెంట్లు భిక్ష, రాఘవులు, రమేష్, ఆశా కార్యకర్తలు,పీహెచ్ సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జాతీయ నాయకునికి సోద ఘనస్వాగతం



**పరకాల,నేటిధాత్రి:** కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు సురేందర్ మెహరోలియా నగరానికి విచ్చేసిన సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేందర్ మెహరోలియా,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు,మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ నాయకులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ నెల 27న ప్రజావాణి రద్దు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, నేటిధాత్రి:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల సమస్యలపై ప్రభుత్వం ఈ నెల 27వ తేదీన హైదరాబాద్ లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినందున 27వ తేదీన రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని,మే 4వ తేదీ సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# 12వ వేజ్ బోర్డు కోసం బిఎంఎస్ ఆందోళనలకు పిలుపు యాజమాన్యంపై తీవ్ర విమర్శలు




**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గనిపై సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) ఆధ్వర్యంలో ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులకు సంబంధించిన 11వ వేతన ఒప్పందం గడువు 30 జూన్ 2026తో ముగియనున్న నేపథ్యంలో, 12వ వేజ్ బోర్డు (జేబీసీసీఐ-శ××) కమిటీ ఏర్పాటు విషయంలో కోల్ ఇండియా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటి వరకు కమిటీ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం కార్మికుల్లో అసంతృప్తిని పెంచుతోందని పేర్కొన్నారు. ఒడిశాలోని తాల్చేర్--అంగుల్ ప్రాంతంలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో జరిగిన అఖిల భారతీయ ఖనిజ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) 113వ వర్కింగ్ కమిటీ సమావేశంలో కార్మిక సమస్యలపై యాజమాన్యాల నిర్లక్ష్య ధోరణిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని ఆరోపించారు. 11వ వేజ్ బోర్డు ఒప్పందంలో వేతన అసమానతలపై హైకోర్టు కేసులు, తదనంతరం డిపిఈ నిబంధనల పేరుతో తీసుకున్న నిర్ణయాల వల్ల కోల్ ఇండియాపై సుమారు రూ.3500 కోట్ల అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అదే సమయంలో కార్మికుల సంక్షేమ పథకాలు, సెలవులు, పబ్లిక్ హాలిడేల్లో కోతలు విధించడం అన్యాయమని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్ణయం 12వ వేజ్ బోర్డు కమిటీ ఏర్పాటు కోసం ఒత్తిడి తీసుకురావడానికి దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వద్ద ద్వార సమావేశాలు, జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి జీడి ప్రభాకర్, జాయింట్ సెక్రటరీలు భూంపల్లి రమేష్, జాయింట్ సెక్రెటరీ మేకల స్వామి, కొమ్ము బాపు, ఫిట్ కార్యదర్శి కుమ్మరి చంద్రశేఖర్, రాజు ప్రశాంత్, అరుణ్ సంపత్, శ్రీనివాస్,శేఖర్, పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ కు ఇచ్చినఆర్య వైశ్యులు



**వనపర్తి, నేటిదాత్రి:** వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ టి వినోద్ కుమార్ కు శ్రీవాసవి కన్యక పరమేశ్వరి అమ్మ వారి చిత్ర పటాన్ని అందజేశారు ఈకార్యక్రమములో జిల్లా ఆర్యవైశ్య సంఘము ఇటుకూరి బుచ్చయ్య వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాం జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళ అధ్యక్షురాలు భీమ ప్రసన్నలక్ష్మి రాణి శ్రీలత వనపర్తి పట్టణ మహిళా సంఘము అధ్యక్షురాలు పిన్నం వసంత సెకరెటరీ పిన్నశీ సుధా లగిశెట్టి సరిత ఆర్యవైశ్య లు జె సి ని శాలువతో ఘనంగా సన్మానంచేశారు ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వై వెంకటేష్ వర్తక సంఘం అధ్యక్షులు పాలాది సుమన్ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు బచ్చు వెంకటేష్ జర్నలిస్ట్ పోలిశెట్టి సురేష్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నేత నాగబంది యాదగిరి మారం బాలీశ్వరయ్య శెట్టి సంబు వెంకటేశ్వర్లు తాడిపర్తి లగిశెట్టి వెంకటస్వామి కె కె కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు

# అడిషనల్ కమిషనర్, డిఎంహెచ్ఓ కి వినతి పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



**గుండాల, నేటిధాత్రి:** గుండాల మండలంలో నెలకొన్న వైద్య సమస్యలపై శనివారం గుండాల పీహెచ్సీ నీ సందర్శించడానికివచ్చిన అడిషనల్ కమిషనర్, డిఎంహెచ్ఓ కి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పొంబోయిన ముత్తయ్య నాయకత్వంలో మండల నాయకులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా గుండాల మండల పరిధిలో సుమారు 14000 మంది జనాభా ఆదివాసి, గిరిజన, గిరిజనేతర పేద ప్రజలు జీవిస్తున్నారు .ఇంత జనాభా ఉన్నా మండలానికి మార్చురీ లేకపోవడంతో 70 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని వారు గుండాల మండల కేంద్రానికి పోస్టుమార్టం మార్చురీ నిర్మాణం చేయాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా గుండాల పిహెచ్సి పరిధిలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని అలాగే 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని వినతి పత్రాలు అందజేశారు. వినతి పత్రాలు అందుకున్న డిఎంహెచ్ఓ అడిషనల్ కమిషనర్ స్పందిస్తూ త్వరలోనే వీటిని నిర్మాణాలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వాంకుడోత్ బికోజి (అజయ్) నాయకులు ఎస్కే అబ్దుల్ నబీ, ఎస్.కె కాసిం, గుర్రం పుష్పరాజు, గడ్డం రాజేష్, ఎస్ కే ఇస్రాజ్, బొంగు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట -4 అంగన్‌వాడీలో పట్టభద్రుల దినోత్సవ వేడుకలు



**పోషక ఆహార ప్రదర్శనతో ఆకట్టుకున్న చిన్నారులు**

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని నర్సంపేట-4 అంగన్‌వాడీ కేంద్రంలో విద్యా సంవత్సరం మరియు పోషణ పక్షోత్సవం ముగింపు సందర్భంగా శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి మధురిమ అధ్యక్షతన పట్టభద్రుల దినోత్సవం మరియు పోషక ఆహార ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం కోసం ఒకపూట భోజనంతో పాటు పాలు, గుడ్లు అందిస్తోందని తెలిపారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. నర్సంపేట-4 అంగన్‌వాడీ కేంద్రం అందరికీ ఆదర్శంగా పనిచేస్తోందని అభినందించారు. శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి మధురిమ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆటపాటలతో విద్యను అందిస్తూ పిల్లలను పాఠశాలకు సంసిద్ధులను చేస్తున్నామని తెలిపారు. 5 సంవత్సరాలు పూర్తయిన పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్నామని, అందులో భాగంగానే పట్టభద్రుల దినోత్సవం నిర్వహించామని వివరించారు. స్థానిక కౌన్సిలర్, అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ కమిటీ అధ్యక్షురాలు రోజా రాణి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రంలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్నారని, పాఠశాల భవనంలో రెండు గదులే ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని శాసనసభ్యులు మాధవ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కొత్త భవన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ బోధకురాలు నల్ల భారతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మే నెలలో సెలవులు ఇస్తూ ఇంటికి తీసుకెళ్లే రేషన్ ఇవ్వాలని ఆదేశించిందని, తల్లులు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వేసవిలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి, కౌన్సిలర్ల చేతుల మీదుగా పిల్లలందరికీ పట్టభద్రుల దినోత్సవ వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొన్నాల మనిషా,ఎలకంటి విజయ్ కుమార్, పర్యవేక్షకురాలు అరుణ, పోషణ అభియాన్ సమన్వయకర్త శ్రీలత, అంగన్‌వాడీ బోధకులు నల్లా భారతి,ఎండి గౌసియా, సహాయకురాలు సునీత, విద్యా కమిటీ అధ్యక్షురాలు క్యాతం తేజశ్రీ, ఆశా కార్యకర్తలు రాజమణి, రమ, సముదాయ వనరుల సిబ్బంది రజిత, ఉమ, అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ కమిటీ సభ్యులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు స్పందించి వారి సమస్యలను పరిష్కరించినట్లే, సింగరేణి కార్మికులు సమ్మెకు దిగకు ముందే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సెక్రటరీ జనరల్ ఐఎన్టీయూసీ, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి జనక్ ప్రసాద్ సారథ్యంలో యూనియన్ సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి అనేక మార్లు చర్చలతో, సమావేశాల ద్వారా, మెమోరాండంల ద్వారా తీసుకెళ్లిన విషయాలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి తలమానికమైన సింగరేణి సంస్థ గత 137 సంవత్సరాలుగా కార్మికుల కృషితో అభివృద్ధి చెందుతూ, వారి రక్తం చెమటల ఫలితంగా లాభాల బాటలో నడుస్తూ ప్రభుత్వానికి ఆర్థికంగా తోడ్పడిందని తెలిపారు. ఎన్నో ప్రాణత్యాగాలతో సంస్థను నిలబెట్టిన ఘన చరిత్ర సింగరేణి కార్మికులదేనని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సింగరేణి సంస్థకు చెందిన సుమారు రూ. 11,500 కోట్ల మిగులు నిధులను కొల్లగొట్టి, సంస్థపై రూ. 29,000 కోట్లకు పైగా బకాయిల భారాన్ని మోపిందని ఆరోపించారు. ఈ కారణంగా నేడు సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి కొత్త ప్రాజెక్టులు చేపట్టలేని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తపరిచారు. సింగరేణి భవిష్యత్తు కొరకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు, అలాగే కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. సొంతింటి పథకం, అలవెన్స్‌లపై చెల్లిస్తున్న ఇన్కమ్ టాక్స్ రీయింబర్స్‌మెంట్, మెరుగైన పదోన్నతులు, నూతన ప్రాజెక్టుల ఏర్పాటు ఇతర కార్మిక సంక్షేమ అంశాలు, ప్రధాన 15 డిమాండ్లను, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిన విధంగానే సింగరేణి కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల బాగాస్వామ్యంతో తీవ్ర ఆందోళనలు, సమ్మెలకు దిగాల్సిన పరిస్థితులు నెలకొనక ముందే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కోటగుళ్ళు గోశాల గోమాతలకు దాన బస్తాల వితరణ



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలోప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గోశాల గోమాతలకు మండలంలోని పరశు రాంపల్లి గ్రామానికి చెందిన ఉడుత తిరుపతి, సంధ్య దంపతులు సంధ్య తండ్రి నగరంపల్లి గ్రామానికి చెందిన గొర్రె లింగయ్య 9 సంవత్సరాల వర్ధంతి సందర్భంగా దాన బస్తాలను అందజేశారు. ప్రతి సంవత్సరం వర్ధంతి సందర్భంగా గోశాలకు దాన బస్తాలు అందజేయడం. ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. గోశాల గోమాతలకు దాన బస్తాలను అందజేసిన తిరుపతి, కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# తిప్పారం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**▸▸కొండపాక ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి.... ▸▸కుకునూరుపల్లి సర్పంచుల పోరం అధ్యక్షులు ఆకుల భద్రప్ప.....**


**సిద్దిపేట, నేటిధాత్రి:** సిద్దిపేట జిల్లా కుకునూర్ పల్లి తిప్పారం గ్రామంలో స్థానిక సర్పంచ్ భద్రప్ప ఆధ్వర్యంలో వడ్ల కొనుకోలు కేంద్రాన్ని ప్రారంభించారు రైతులకు సరైన సమయంలో రైస్ మిల్లు కు వడ్లను అందజేయాలని వడ్లను తొందరగా కొనుగోలు చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది రావద్దని అధికారులకు సూచించారు సర్పంచ్ ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్యాక్స్ మాజీ డైరెక్టర్ నరసింహ చారి ఏవో ఏఈఓ ఏపీఎం ఐకెపి సిబ్బంది గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు నాయకులు కోరే చరణప్ప ఇరుసాల కరుణాకర్ కోరేమల్లేశం కోవూరు కృష్ణారెడ్డి మల్లారెడ్డి నాగయ్య నాగరాజు సిద్ధప్ప చంద్రమౌళి గడ్డం నర్సింలు శ్రీరాముల నవీన్ తుడుం ఎల్లం భోగి కరుణాకర్ బాలరాజు హమాలీ సంఘం నాయకులు రైతులు పాల్గొన్నారు.

# బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు కండే రవి మాట్లాడుతూ ఏప్రిల్ 26 2026 ఆదివారం రోజున భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బీసీ ,ఎస్సీ ,ఎస్టీ జాక్ ఆవిర్భవ సభ బాలాజీ ఏసీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించడం జరుగుతుంది .ఈ సభకు ముఖ్య అతిథిగా ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బీసీ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ విశిష్ట అతిథిగా తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్ రాసాల వినోద్ యాదవ్ పూసల సాయిబాబా. ఉమ్మడి జిల్లా చైర్మన్ చంద మల్లయ్య, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మేకల సుమన్, హాజరు కానున్నారు. ఈ చారిత్రాత్మక మహాసభను విజయవంతం చేయడానికి భూపాలపల్లి జిల్లా గణపురం మండలం లో ఉన్నటువంటి బీసీ, ఎస్సీ ,ఎస్టీ అగ్రకుల ప్రజాస్వామ్య వాదులు అందరూ ఈ సభలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు కండే రవి మండల స్టీరింగ్ కమిటీ సభ్యులు కుర్రి స్వామినాథన్ కోగిల జితేందర్ ఇంజపెల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జనగణన సమర్థవంతంగా నిర్వహించాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాలపల్లి, నేటిధాత్రి:** జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జనగణన కార్యక్రమంలో భాగంగా మొదటి దశ అయిన గృహ లెక్కింపు గృహ వసతి గణన మే 11 నుండి జూన్ 6 వరకు నిర్వహించబడనుందని తెలిపారు. ఈ ప్రక్రియకు ముందుగా ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు స్వీయ లెక్కింపు (Self Enumeration) సదుపాయాన్ని https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా ఈనెల 26 నుండి మే 10వ తారీకు వరకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ గృహ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రజలుఇంటి సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడానికి ఇది సులభమైన వేగవంతమైన విధానమని అన్నారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత ఒక యూనిక్ కోడ్ వస్తుందని, దీనిని తదుపరి గణనాధికారి కు చూపించాలన్నారు. స్వీయ లెక్కింపులో పాల్గొనడం ద్వారా జనగణన ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వ రంగ ఉద్యోగులు ఇతర వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలందరూ ఈనెల 26 నుండి మే 10 తారీకు వరకు స్వీయ లెక్కింపులో తప్పనిసరిగా పాల్గొని జనగణన 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.

# చిన్నారులు,గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**జైపూర్, నేటిధాత్రి:** చిన్నారులు,గర్భిణుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ 8వ విడత కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ పక్వాడ 8వ విడత కార్యక్రమం ఈనెల 9 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పిల్లలలో మొదటి 6 సంవత్సరాల కాలంలో మెదడు అభివృద్ధి గరిష్టంగా ఉంటుందని, ఈ విషయం ప్రధాన అంశంగా పరిగణలోకి తీసుకుని ప్రత్యేక దృష్టిహూహూసాధించడం జరిగిందని తెలిపారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి పోషకాహారం అత్యవసరమని,గర్భిణి స్త్రీలు, చిన్నపిల్లలకు సరైన ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తు నిర్మించవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. గర్భిణులు,బాలల పోషకాహారం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని,తొలి వేయి రోజులలో సరైన పోషణ, శిశు అభివృద్ధిపై దృష్టి సారించాలని,అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆటల ఆధారిత విద్యను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. పోషణ పంచాయతీలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పిల్లలలో స్క్రీన్ టైమ్ తగ్గించే దిశగా తల్లిదండ్రులకు మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. నలుగురు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం,బాలలకు అక్షరాభ్యాసం,గ్రాడ్యుయేషన్ ధ్రువపత్రాల అందజేత కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా స్థానిక సమాజం, తల్లులు,సంరక్షకులను భాగస్వామ్యం చేస్తూ పోషకాహారం పై విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, నేటిధాత్రి:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు,మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ లతో కలిసి అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో **మ్యాపింగ్ శాతాన్ని పెంపొందించడం అత్యవసరమని తెలిపారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 2002** ఓటర్ల జాబితాలు https://ceotelangana.nic.in, https://ceotelangana.nic.in, ఓటర్ సర్వీస్ పోర్టల్ https://voters.eci.gov.in, https://voters.eci.gov.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా,మండల స్థాయి అధికారులు తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు (రెగ్యులర్,ఒప్పంద,పొరుగు సేవలు,దినసరి,ఇతరులు),వారి కుటుంబ సభ్యులు తాము నమోదు చేయబడిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారులను సంప్రదించి 2002 ఓటర్ల జాబితాలో ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించాలని,మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి వివరాలను ధ్రువీకరించి తొలగించాలని/ సవరించాలని తెలిపారు. ఒకే నియోజకవర్గంలో చిరునామా మార్చుకున్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి సరైన చిరునామాలో ఓటు నమోదు చేయాలని,ఇతర నియోజకవర్గాలు మారిన ఓటర్లను ప్రస్తుత జాబితా నుండి తొలగించాలని తెలిపారు. జిల్లాలో డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని,ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు దినపత్రికలు, స్థానిక ఛానల్లలో స్క్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్,గ్రామీణ ప్రాంతాలలో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాల ద్వారా టామ్ టామ్ ప్రచారం నిర్వహించి ఓటర్లను చైతన్యపరచాలని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో కృషిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 27న నిర్వహించే బందుకు సహకరించాలి



**పరకాల, నేటిధాత్రి:** డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 27న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ఫర్టిలైజర్ దుకాణాల బంద్‌కు పూర్తి మద్దతు ఇవ్వాలని పరకాల ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్ అసోసియేషన్ అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింకు ఉత్పత్తులు లేకుండా ఎరువులు సరఫరా చేయాలని, డీలర్లపై అనవసరమైన ఇతర ఉత్పత్తులను రుద్దకూడదని డిమాండ్ చేశారు. ఎరువుల సరఫరాలో పారదర్శకత ఉండాలని, డీలర్ల హక్కులను పరిరక్షించేందుకు ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డీలర్లు స్వచ్ఛందంగా పాల్గొని తమ దుకాణాలను మూసివేసి బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం" "శక్తి బ్రాడ్ కాస్టింగ్స్" ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.



"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
"యూట్యూబ్ ఛానల్" కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

**Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03**
**Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034**



"నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం

22ND ANNIVERSARY వసంతాల అక్షరోద్యమం 2004-2026

చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్ళు" దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ
పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....

22th ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

# మధుమేహులకు అనువైన సమ్మర్ డ్రింక్స్ ఇవే..!

మార్చిలోనే భానుడి ప్రతాపంతో ఎండ తాకిడి మొదలైంది. మధ్యాహ్న సమయంలో బయటకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. వేసవి తాపం తీర్చుకునేందుకు జనం పండ్ల రసాలు వంటివి తీసుకోవడం సహజం. అయితే మధుమేహులు తమ షుగర్ లెవెల్స్ పెంచని సమ్మర్ డ్రింక్స్‌ను ఎంచుకోవడం మేలు. ఎలాంటి పరిస్థితులోనూ పండ్ల నుంచి తీసిన రసాన్ని మధుమేహులు తీసుకోరాదని బెంగళూర్‌కు చెందిన డైటీషియన్ నిధి నిగం హెచ్చరిస్తున్నారు. ఫ్రూట్ జ్యూస్‌లో పండులో ఉన్నంత ఫైబర్ ఉండదని దీంతో వెనువెంటనే షుగర్ లెవెల్స్ పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. అయితే ప్రత్యామ్నాయ సమ్మర్ పానీయాలతో మధుమేహులు తమ దాహార్తి తీర్చుకోవచ్చని సూచిస్తున్నారు.

దయాబెటిక్‌తో బాధపడేవారు వారి షుగర్ లెవెల్స్ పెరగకుండానే హైడ్రేట్‌గా ఉండేందుకు ఇంటి నుంచే కొన్ని సహజసిద్ధమైన, ఆరోగ్యకర కూలింగ్ డ్రింక్స్ తయారుచేసుకోవచ్చని డైటీషియన్ కవితా దేవ్‌గన్ చెబుతున్నారు. భోజనానికి ముందు ఈ సమ్మర్ డ్రింక్స్



తీసుకోవాలని న్యూట్రిషనిస్టులు సూచిస్తున్నారు. ఇక మధుమేహులకు అనువైన సమ్మర్ డ్రింక్స్‌ను పరిశీలిస్తే..

**సబ్జా సీడ్స్‌తో కొబ్బరి నీరు,చియా సీడ్ డ్రింక్,కోకుమ్ షర్బత్,మజ్జిగ, క్రాన్‌బెర్రీ జ్యూస్,వెజిటబుల్స్ జ్యూస్**

# స్ట్రాబెర్రీస్, ద్రాక్ష తినేముందు ఇలా చేయండి..!


స్ట్రాబెర్రీస్, ద్రాక్ష సీజన్ ప్రారంభం కావడంతో వీటిని చాలా మంది ఆస్వాదిస్తుంటారు. అయితే వీటిని తినే ముందు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వీటిని సరైన రీతిలో శుభ్రం చేయకుండా తీసుకుంటే గొంతు నొప్పి సహా పలు ఇన్ఫెక్షన్లు వెంటాడతాయని ఆరోగ్య సంరక్షకులు చందర్ అస్రానీ చెబుతున్నారు.

ఈ పండ్లపై మిగిలిఉండే ఎరువులు, రసాయనాలను తొలగించేందుకు ఉప్పు నీటిలో 20 నిమిషాల పాటు నానబెట్టి ఆపై డ్రై క్లాత్‌తో తుడిచిన తర్వాతే వాటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే అస్వస్థతకు లోనయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



# సమతుల ఆహారమే.. మన ఆరోగ్యానికి హామీ

మన ఆరోగ్యానికి సమతుల ఆహారమే హామీ ఇస్తుంది. రోజువారీ భోజనంలో అన్నంతోపాటు ఐదు రకాల రంగురంగుల కూరగాయలను సమపాళ్లలో తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేస్తే తినే పళ్లాన్నే కాకుండా మన జీవితాన్నీ రంగులమయం చేసుకోవచ్చు, ఆరోగ్యంగా బతికేయొచ్చు.



**క్యారట్లు**
128 గ్రాములు తీసుకోవాలి. వీటిలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. రోజువారీగా అవసరమైన ఎ విటమిన్‌లో 119 శాతం దీన్నుంచి లభిస్తుంది. క్యాన్సర్ నివారణకు వీటిలో ఉండే బీటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ దోహదపడుతుంది.



**పాలకూర**
30 గ్రాములు తీసుకోవాలి. రోజువారీ విటమిన్ ఎ అవసరంలో 16 శాతం లభిస్తుంది. అలానే విటమిన్ కె 120 శాతం అందుతుంది. క్యాన్సర్ ముప్పును పాలకూర తగ్గిస్తుంది.



**బ్రకోలిజి**
91 గ్రాముల బ్రకోలి నుంచి రోజువారీ విటమిన్ కె 77 శాతం లభిస్తుంది. విటమిన్ సి 90 శాతం అందుతుంది. అదనంగా ఫోలేట్, మాంగనీస్, పొటాషియం కూడా లభిస్తాయి. ఇది కూడా క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. గుండెజబ్బులకు సంబంధించిన ఇన్‌ఫ్లమేటరీ కారకాలను నియంత్రిస్తుంది.




**పచ్చి బటానీలు**
160 గ్రాముల బటానీల్లో 9 గ్రాముల ఫైబర్, 9 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఎ, సి, కె విటమిన్లు, రిబోఫ్లెవిన్, థయామిన్, నియాసిన్ లాంటి బి కాంప్లెక్స్ విటమిన్లు, ఫోలేట్ సమృద్ధిగా ఉంటాయి. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి, ట్యూమర్ల ముప్పు తగ్గడానికి పచ్చి బటానీలు దోహదపడతాయి.

# వ్యాయామంతో తగ్గనున్న స్ట్రోక్ ముప్పు

మెదడుకు అకస్మాత్తుగా రక్త సరఫరాలో అడ్డంకులు ఏర్పడినప్పుడు స్ట్రోక్ ముప్పు తలెత్తుతుంది. రక్తసరఫరాలో బ్లాకేజ్ (ఇస్కిమిక్ స్ట్రోక్), బ్లీడింగ్ (హమరేజిక్ స్ట్రోక్) వంటి సమస్యలతో స్ట్రోక్ ముంచుకొస్తుంది. ఈ సందర్భాల్లో మెదడుకు ఆక్సిజన్, పోషకాల సరఫరా నిలిచిపోవడంతో మెదడు దెబ్బతినడం, మెదడు కణాలు దెబ్బతినడం జరుగుతుంది. స్ట్రోక్స్ ప్రాణాంతకమే కాకుండా దాని ప్రభావం మెదడు, శరీర అవయవాలపై తీవ్రంగా ఉంటుంది. ఇది స్ట్రోక్ ఎక్కడ తలెత్తింది, బ్రైన్ డ్యామేజ్ ఏ మేరకు జరిగిందనే దానిపై అది చూపే ప్రభావ తీవ్రత ఆధారపడి ఉంటుంది.

అయితే నిత్యం వ్యాయామం చేసేవారిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలతో పాటు స్ట్రోక్ ముప్పును కూడా నివారించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా మెదడు సహా శరీర భాగాలన్నింటికీ రక్తసరఫరా మెరుగుపడుతుంది. నిత్య వ్యాయామంతో స్ట్రోక్ ముప్పును తగ్గించే కారకాలను పరిశీలిస్తే..



**వ్యాయామంతో గుండె ఆరోగ్యం మెరుగు**
**బరువు నియంత్రణ**
**బీపీ నియంత్రణ**
**అదుపులో మధుమేహం**
**కొలెస్ట్రాల్ బ్యాలెన్స్**
**రక్త సరఫరా మెరుగుదల**
**వాపు ప్రక్రియకు చెక్**
**ఒత్తిడి మటుమాయం**
**నూతన కణాలతో రక్తసరఫరా మెరుగుదల**

# ఈ డీటాక్స్ డ్రింక్స్‌తో అందం, ఆరోగ్యం సొంతం

ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలని కోరుకోని వారంటూ ఉండరు. ఈ క్రమంలో డీటాక్స్ డ్రింక్స్‌కు విపరీతమైన ఆదరణ పెరుగుతోంది. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడితో చిత్తయ్యే రోజుల్లో శరీరంలో పేరుకుపోయే వ్యర్ధాలను బయటకు పంపే ప్రక్రియ డీటాక్స్ డ్రింక్స్‌తో సాధ్యం కావడంతో వీటిని తీసుకునేందుకు పలువురు ఆసక్తి చేపుతున్నారు.


డీటాక్సిఫికేషన్ ప్రక్రియలో శరీరానికి సహకరించేందుకు మనం తీసుకునే ఆహారంలో మార్పులు తప్పనిసరని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. డీటాక్సిఫికేషన్ ప్రక్రియలో శరీరంలోని కీలక అవయవాలు శుభ్రం అవుతాయి. వందల ఏండ్లుగా డీటాక్సింగ్‌ను ఎందరో అనుసరిస్తున్నారని, ఇది ప్రాచీన థెరఫీ అని మ్యాగీ పనెల్ తన బుక్ ది డిటాక్స్ కుక్‌బుక్ అండ్ హెల్త్ ప్లాన్‌లో రాసుకొచ్చారు.

డీటాక్స్ జీర్ణ వ్యవస్థను శుభ్రం చేయడంతో పాటు శరీరం నుంచి వ్యర్ధ పదార్ధాలను విసర్జించడంలో సహకరిస్తుంది. ఈ క్రమంలో డీటాక్స్ డ్రింక్స్ ఆదరణ పొందుతున్నాయి. శరీరం నుంచి వ్యర్థాలను తొలగించకుంటే అది కడుపుబ్బరం, గ్యాస్, తలనొప్పి, మలబద్ధకం, చర్మ సమస్యల వంటి పలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. రోజూ డీటాక్స్ డ్రింక్స్ తీసుకోవడం ద్వారా బరువు తగ్గడం, జీవ క్రియల వేగం పెరగడం, జీర్ణశక్తి మెరుగవడం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. ఇక ప్రతిరోజూ మనం ఎలాంటి డీటాక్స్ డ్రింక్స్ తీసుకోవచ్చంటే..



**దానిమ్మ జ్యూస్,నిమ్మ, మింట్‌తో కొబ్బరి నీళ్లు,డీటాక్స్ పసుపు టీ,తేనె, నిమ్మ, అల్లం టీ ,ఆరెంజ్, క్యారెట్, అల్లం డీటాక్స్ డ్రింక్
లెమన్, మింట్ డ్రింక్,కీరా, మింట్ డ్రింక్,పింక్ సాల్ట్, అల్లం డీటాక్స్ వాటర్,జీరా వాటర్**

# ఈ ఆహారంతో ఫ్యాటీ లివర్ ముప్పునకు చెక్



ఆధునిక జీవనశైలితో మద్యం సేవించే వారితో పాటు మద్యం తీసుకోని వారిలోనూ (నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్) ఫ్యాటీ లివర్ సమస్య పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. లివర్‌లో అధికంగా కొవ్వు పేరుకుపోవడం ద్వారా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ పరిస్థితి నివారించడం, నియంత్రించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది.

ఫ్యాటీ లివర్ వ్యాధి ముప్పును తగ్గించేందుకు ఆరోగ్యకర ఆహారాన్ని జీవనశైలిలో భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహారంలో ముఖ్యంగా పాలకూర వంటి యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సీ వంటి విటమిన్స్, మెగ్నీషియం వంటి మినరల్స్ అధికంగా ఉండే ఆకుకూరలు అధికంగా తీసుకోవాలి.


ఇవి లివర్‌లో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంతో పాటు శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను నియంత్రిస్తాయి. ఇక ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే సాల్మన్, మాక్‌రెల్, సార్డినెస్ వంటి ఫ్యాటీ ఫిష్‌లు లివర్‌లో ఫ్యాట్ లెవెల్స్, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఒమెగా 3 ఆమ్లాలు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఇక ఒలెరుపిన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ కూడా లివర్ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఇక ఈ పది ఆహారాలను డిన్నర్‌లో తీసుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్‌ను నియంత్రించవచ్చు..

**ఆకుకూరలు ఫ్యాటీ ఫిష్ ఆలివ్ ఆయిల్ నట్స్, సీడ్స్ అవకాడో వెల్లుల్లి బెర్రీస్‌జి గ్రీన్ టీ పసుపు తృణధాన్యాలు**

# ఫోలేట్.. తీసుకుంటున్నారా?

ఫోలేట్‌ను విటమిన్ బి9 అని కూడా పిలుస్తారు. రోజువారీ పనులు, గర్భిణిగా ఉన్న సమయంలో పిండం అభివృద్ధిచెందడంలో, తల్లి రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తగినమోతాదులో ఉండటంలో ఫోలేట్ కీలకపాత్ర పోషిస్తుంది. ఇది తక్కువగా ఉంటే నాడులకు సంబంధించిన రుగ్మతలు వస్తాయి. మెదడు పనితీరు మందగిస్తుంది. ఫోలేట్ వివిధ ఆహార పదార్ధాల నుంచి సహజంగానే లభిస్తుంది. ఇక విటమిన్ సప్లిమెంట్లు, ఫోర్టిఫైడ్ ఆహారాల్లో మాత్రం దీన్ని ఫోలిక్ యాసిడ్ రూపంలో జతచేస్తారు. అయితే, సహజమైన ఫోలేట్‌లా కృత్రిమ ఫోలిక్ యాసిడ్ శరీరంలో కలిసిపోదని కొందరి అభిప్రాయం.

కాబట్టి మనం తినే ఆహారంలోనే ఫోలేట్ ఎక్కువగా ఉన్నవాటిని ఎంచుకోవడం మంచిది. పాలకూర, తోటకూర, అవకాడో, పచ్చిబటాణీలు, బ్రసెల్స్ స్ప్రౌట్స్, బ్రకోలీ, ఆవకూర, టమాటాలు, నారింజ, పల్లీలు, అంగూర్లు, పొప్పడి, అరటి పండ్లు, పచ్చసొనతో కూడిన గుడ్లు, జంతు మాంసంలో తినదగిన అవయవాలు (ఆర్గాన్ మీట్స్)



మొదలైన వాటిలో ఫోలేట్ దొరుకుతుంది. అయితే సేంద్రియమైనవి, హానికరమైన పురుగుమందుల అవశేషాలు లేని పదార్థాలు ఎంచుకోవాల్సి ఉంటుంది.

